క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి తాడిగడప, కానూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు మంగళవారం తెలిపారు. యనమలకుదురు సెక్షన్ పరిధి తాడిగడప ఫీడర్‌లో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తాడిగడప ప్రధాన గ్రామం, ఎస్‌టీబీఎల్ కాలనీ, పెదపులిపాక గ్రామం, డొంకరోడ్డు, గ్రీన్‌సిటీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కానూరులో...

కానూరులో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వివాన్ అపార్టుమెంట్స్ 100 ఫీట్‌రోడ్డు, ఇండస్ట్రీల్ ఫీడర్ ఎ,బి,సి, బ్లాక్‌ల ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని స్థానికులు సహకరించాలని కోరారు.

శ్రీసత్య సాయిబాబా జయంతి వేడుకలు



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో భగవాన్ శ్రీసత్య సాయిబాబా 100వ జయంతి ఉత్సవాలు శ్రీసత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ప్రతీ ఏటా చిన్నారులకు పలు పోటీలు నిర్వహిస్తున్నామని సేవా సమితి పెనమలూరు కన్వీనర్ వి.మోహన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సేవా సమితి నిర్వాహకులు విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసత్య సాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇన్‌చార్జి కె.నాగప్రసాద్, సభ్యులు కె.కోటంరాజు, ఉయ్యూరు రమణమ్మ, ఎస్.రత్నశ్రీ, పి.శ్రీరామ్, ఆకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బైండోవర్ కేసులు నమోదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నాటు సారా విక్రయాలు సాగించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గన్నవరం ఎస్‌ఐ ఎంఎస్ఎన్ శాస్త్రి హెచ్చరించారు. బాపులపాడు మండలంలోని మడిచర్ల, కొయ్యూరు, వేలేరు గ్రామాలకు చెందిన 13 మంది నాటు సారా విక్రేతలపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గన్నవరం ఎస్‌ఐ ఎంఎస్ఎన్ శాస్త్రి మంగళవారం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ కె.వెంకటరమణ ఎదుట హాజరుపర్చారు. మడిచర్లకు చెందిన రాజేశ్వరి ఇప్పటికే పలుమార్లు నాటు సారా విక్రయిస్తూ పట్టుబడటంతో ఆమెకు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ రూ.10 వేలు అపరాధ రుసుము విధించినట్లు ఎస్‌ఐ శాస్త్రి తెలిపారు.

సూరంపల్లి సర్పంచ్ గుండెపోటుతో మృతి



గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామ సర్పంచ్ పులపాక బాబూరావు(66) మంగళవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాబూరావు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. ఆయన పార్థివదేహానికి ఎంపీపీ అనగాని రవి, వంశీ యువసేన నాయకుడు ఓలుపల్లి మోహనరంగా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కంటి సమస్యలను తొలిదశలోనే గుర్తించాలి



కంకిపాడు: కంటి సమస్యలను తొలి దశలోనే గుర్తించాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి.రాజేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 60 ఏళ్లు నిండిన 79 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రాజేష్ కుమార్ మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చూపు కోల్పోవాల్సి వస్తుందని సకాలంలో సమస్యను గుర్తించి వైద్య సేవలు పొందాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత లక్ష్మీప్రసాద్‌రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలోని గ్రామ సచివాలయం ప్రాంగణంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ బొరపరెడ్డి గణేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి దళారీ వ్యవస్థ లేకుండా నిస్పక్షపాతంగా లబ్ధిదారులను ఎంపిక చేసి సంక్షేమ ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారని తెలిపారు. జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి ఆవిర్నేని శేషగిరిరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. ఎ.సీతారామపురంలో గత నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా వివిధ పథకాల లబ్ధిదారులకు రూ. 18.15 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.9.22 కోట్లు, మొత్తంగా గ్రామంలో రూ. 27.37 కోట్లు లబ్ధి చేకూరిందని వివరించారు. అనంతరం సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సంక్షేమాభివృద్ధి బోర్డును ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు కాకాని సంజయ్ కుమార్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీటీసీ సభ్యురాలు మక్కా అచ్చమాంబ, వైఎస్సార్ సీపీ నాయకుడు మక్కా స్టాలిన్ పాల్గొన్నారు.

గోసాల వైకుంఠపురంలో...

పెనమలూరు: గోసాల వైకుంఠపురం సచివాలయం -2లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గోసాల సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు



తాడిగడపలో లబ్ధిదారులతో వైఎస్సార్ సీపీ నేతలు

మాట్లాడుతూ గోసాల గ్రామంలో ఎన్నడూ లేని విధంగా లబ్ధిదారులకు రూ. 60 కోట్ల వరకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించన్నారు. గ్రామంలోని అన్ని ప్రాంతాలను పూర్తిగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పోలవరపు రవి, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈవో ప్రసాద్, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాడిగడపలో...

తాడిగడప సచివాలయం-4లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. సచివాలయం పరిధిలో గడిచిన నాలుగున్నరేళ్లలో రూ. 45 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమచేసిందని మున్సిపాలిటీ మేనేజర్ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కె.క్రిష్టోఫర్, జిన్నా, పిజె.కిషోర్, షేక్.ముజీబ్, అర్షద్, ఖాద్‌బాషా, వెలిశిల ప్రసాద్, ఆశిష్, ఎస్.ప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెన్నేరు గ్రామంలో...

కంకిపాడు: మండలంలోని తెన్నేరు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్‌లు జుజ్జువరపు ఎలీషా, సీహెచ్ ఆదర్శకుమార్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ రామినేని రమాదేవి, ఈవోఆర్డీ మైథిలి, పలువురు అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



ఎ.సీతారామపురంలో సంక్షేమాభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ముదునూరు గ్రామంలో...

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి, సర్పంచ్ మొవ్వా వెంకటనాగలక్ష్మి, వైస్ ఎంపీపీ గంజి స్వర్ణకుమారి, పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పల్లపోతు శ్రీనివాసరావు, పలువురు పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

ఉయ్యూరు పట్టణంలో...

ఉయ్యూరు పట్టణంలోని 18, 19 వార్డుల పరిధిలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, కౌన్సిలర్లు నూర్జహాన్, సుధాకర్‌బాబు, రాజులపాటి చిన్ని, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు అబ్దుల్‌సద్దాం, మహ్మద్‌ఖాన్, వణుకూరు సురేష్, సలీంబేగ్, బ్రహ్మం పాల్గొన్నారు.

వీరపనేనిగూడెంలో...

గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం గ్రామంలో ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యాన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును నాయకులు ఆవిష్కరించారు. అనంతరం స్థానిక సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఏఎంసీ ఛైర్ పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి, జెడ్పీటీసీ సభ్యుడు అన్నవరపు ఎలిజబెత్ రాణి, సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, ఉప సర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి, సహకార బ్యాంకు అధ్యక్షుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం మంగళవారం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 250 మంది భక్తులకు హీరో షోరూమ్ అధినేత మూల్పూరు సురేంద్ర, సాయికల్యాణి దంపతుల సహకారంతో అన్నదానం జరిగింది. ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులకు ఆలరించింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన ప్రణవం ఆర్ట్స్ అకాడమీకి చెందిన సీహెచ్ తాన్య, వర్ణిక, ప్రాజ్ఞవి, హిరణ్య, వెన్నెలతో పాటు పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కలిపించి ప్రసాదాలను అందజేశారు.

కులగణనలో పూర్తి వివరాలు సేకరించాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 27 నుంచి వారం రోజుల పాటు జరిగే కులగణనలో పూర్తి వివరాలు సేకరించాలని ఇన్‌చార్జీ జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కె.అనురాధ అన్నారు. విజయవాడరూరల్ మండల పరిషత్ కార్యాలయంలో కులగణన సర్వేపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కుటుంబంలోని సభ్యులందరి వివరాలను సేకరించాలని పేర్కొన్నారు. కులం, మతం, వృత్తి, ఇంటి స్వరూపం వివరాలతో పాటు ప్రధానంగా ఐరిష్, వేలిముద్ర, ఫేషియల్ ఈ మూడింటిలో ఏదైనా ప్రతి మనిషి నుంచి తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో బి.భార్గవి మాట్లాడుతూ కులగణన సర్వే త్వరితగతిన పూర్తి కావడానికి మండలాన్ని రెండు భాగాలుగా చేసి రెండు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రేడ్ 1,5,6 సెక్రటరీలతో పాటు, డిజిటల్ అసిసెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు కులగణన సర్వేలో పాల్గొన్నాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ బిఎల్‌వీ శేషగిరిరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనురాధ, వేదికపై ఎంపీడీవో, ఈఓఆర్డీ

గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోలు

పెనమలూరు: రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధరకే విక్రయించాలని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని పోరంకి సొసైటీ అధ్యక్షుడు మంచినేని పరమేష్ అన్నారు. పోరంకిలో రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు పరమేష్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన ధరలకే ధాన్యం కొనుగోలు చెయడం జరుగుతుందని చెప్పారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులకు అండగా ప్రభుత్వం ఉందని, రైతులు పండించిన పంటకు తగిన న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని అన్నారు. ధాన్యం కనీస మద్దతు ధర ఏ గ్రేడ్ 75 కేజీలు రూ. 1652, కామన్ ధర రూ. 1637 లుగా నిర్ణయించారని వెల్లడించారు. కార్యక్రమంలో వీఏఏ స్మైలీ, రైతులు బోడె వెంకటభూషణ్, తిరుమలరావు, వి.సాంబశివరావు, పలువురు గ్రామ రైతులు పాల్గొన్నారు.



పోరంకిలో ప్రసంగిస్తున్న సొసైటీ అధ్యక్షుడు పరమేష్

తేమశాతం సమర్థంగా నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి

కంకిపాడు: ధాన్యం కొనుగోళ్లలో తేమ శాతం సమర్థంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి అన్నారు. మండలంలోని పునాదిపాడు, కోలవెన్ను రైతు భరోసా కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమ శాతం పరిశీలన తీరుపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఆయా కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రైతుల వివరాల నమోదును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ధాన్యం సేకరణ దగ్గర నుంచి తేమ శాతం నమోదు చేసి ధాన్యం సేకరించి మిల్లులకు తరలించే వరకూ బాధ్యతతో పని చేయాలన్నారు. రైతులకు మద్దతు ధర దక్కాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. తేమ శాతం పరిశీలనలో లోటుపాట్లు వల్ల రైతులకు మద్దతు ధర దక్కకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రైతులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క రైతు నుంచి ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ స్వర్ణలత, ఏఓ పిఎం.కిరణ్, వీఏఏలు కె.పావని, పవన్‌కల్యాణ్, కె.సురేష్ పాల్గొన్నారు.



తేమ శాతం నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎస్.పద్మావతి

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు న్యాయం

కంకిపాడు: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారానే రైతులకు న్యాయం జరుగుతుందని తహసీల్దార్ పీఎస్‌పీ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామం నుంచి ధాన్యం లోడు లారీలను మంగళవారం మిల్లులకు తరలించారు. లారీలను తహసీల్దార్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించవద్దని మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, ఎంపీటీసీ సభ్యుడు బూరగ బాలాజీ, ఆర్‌ఐ వెంకటరమణ, ఏఎంసీ డైరెక్టర్ నకరికంటి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, బిళ్లా వెంకటేశ్వరరావు, నాగదేశి బాలకృష్ణ, సొసైటీ కార్యదర్శి వల్లభనేని మణికంఠ, వీఆర్‌ఓ చైతన్య, వీఏఏ వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



ధాన్యంలోడు లారీలను జెండా ఊపి ప్రారంభిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్ రూరల్: యోగా సాధనతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, అతిబరువు, సోమరితనం, అహంకారం తగ్గుతాయని ప్రముఖ యోగా గురువు శివానంద ఆచార్య తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్డులోని నారాయణ స్కూల్ ప్రాంగణంలో 'ధ్యాన-విజ్ఞాన-యోగ' శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. ధ్యానాసన యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని శివానంద చెప్పారు. యోగా సాధనతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని, జీవనశైలి వ్యాధులకు శాశ్వత పరిష్కారం పొందవచ్చని వివరించారు. ప్రత్యేక యోగా శిబిరంలో 10 రోజుల పాటు ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నూతన హంగులతో ఇందుపల్లి పీహెచ్‌సీ భవనం

రూ. 1.82 కోట్లతో అభివృద్ధి

ఉంగుటూరు: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తూనే మరో వైపు నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ నూతన భవనాలు, మరమ్మతులు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారు. ఇందులో భాగంగా నాడు-నేడు ద్వారా రూ.1.82 కోట్లతో ఇందుపల్లి పీహెచ్‌సీ నూతన భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. ఇందుపల్లి పీహెచ్‌సీకి అనుసంధానంగా ఉన్న 11 గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెద అవుటపల్లి, ఉంగుటూరు పీహెచ్‌సీలకు నూతన భవనాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు.

అత్యాధునిక వసతులతో 15 గదులు...

అత్యాధునిక వసతులతో 15 గదుల ఇందుపల్లి పీహెచ్‌సీ భవనం ముస్తాబయింది. పూర్తిస్థాయి సిబ్బందికి అవసరమైన అన్ని వసతులు, రోగుల వైద్య పరీక్షలకు సౌకర్యవంతమైన గదులు ఏర్పాటు చేశారు. వైద్యాధికారులకు రెండు గదులు, లేబర్‌రూమ్, ఆయుష్ డాక్టర్ గది, రెండు వార్డులు, స్టెరిలైజేషన్, ఫార్మశి, హెడ్‌నర్స్, ఆఫీస్, ల్యాబొరేటరి గదులను అత్యంత సుందరంగా సిద్ధం చేశారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ భవనం



అంతర్గత రహదారి పనులు

మండల పరిషత్ నుంచి రూ.10లక్షలు...

ఎన్నో ఏళ్లుగా ఆసుపత్రి భవనం శిథిలావస్థలో ఉండటంతో ఆవరణంలో చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు ఉండేవి. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సూచనల మేరకు మండల పరిషత్ నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. దీంతో పీహెచ్‌సీ భవనం చుట్టూ ఆవరణంలో అంతర్గత రహదారి, మెరక, జంగిల్ క్లీయరెన్స్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.



నాటి పాత భవనం

వంట పాత్రలు పంపిణీ



వంట పాత్రలు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు

కంకిపాడు: జగనన్న గోరుముద్ద కార్యక్రమంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతోందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు లాకుగూడెం పాఠశాలలో వంట ఏజెన్సీ కార్మికులకు వంట పాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపాలను నివారించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోరుముద్ద కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ కార్మికులు బాధ్యతతో చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని 45 పాఠశాలలకు రూ 4.95 లక్షలు విలువ చేసే వంట పాత్రలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు ఏజెన్సీ కార్మికులకు వంట పాత్రలను అందించారు. హెచ్ఎం వెంకటేశ్వరరావు, ముసిబోయిన మోహనకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రపై శిక్షణ కార్యక్రమం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు నేతృత్వంలో పోటీల నిర్వాహణపై వలంటీర్లకు అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్, క్రికెట్ క్రీడా విభాగాల్లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సమన్వయంతో ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు సచివాలయాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.



శిక్షణలో పాల్గొన్న వలంటీర్లు

వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించండి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల హక్కులపై అవగాహన, పరిరక్షణకు ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని.. ఈ నేపథ్యంలో జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, క్లబ్‌లు వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఆ వివరాలను డిసెంబర్ 8వ తేదీలోగా తమ కార్యాలయంలో అందజేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వినియోగదారుల అవగాహనపై వీడియో, ఫొటోలతో పాటు సమగ్ర నివేదికను పంపితే వాటిలో ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేస్తామన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం నాడు నిర్వహించే రాష్ట్ర స్థాయి వేడుకల్లో ఉత్తమమైన వాటిని పంపిన వారిని సత్కరిస్తామని పేర్కొన్నారు. పౌర సరఫరాల కమిషనర్ మార్గదర్శకాలకు అనుగుణంగా వినియోగదారుల రక్షణ చట్టం-2019పై షార్ట్‌ఫిల్మ్, ర్యాలీ, స్కిట్‌లు, ఇంటింటి ప్రచారం, ప్రదర్శనలు, ఎక్స్‌పో వంటివి నిర్వహించవచ్చన్నారు. వినియోగదారుల స్వచ్ఛంద సంస్థలు సొంతగా లేదా వినియోగదారుల క్లబ్‌ల విద్యార్థులతో కార్యక్రమాలు నిర్వహించవచ్చని.. అయితే ఎంఈవో, స్కూల్ హెడ్‌మాస్టర్ నుంచి అనుమతి పొందాలని జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ అన్నారు.

ప్రైవేటు సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

కంకిపాడు: ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా పేర్కొన్నారు. సమితి ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్ర మంగళవారం కోలవెన్ను, నెప్పల్లి, గొడవర్రు, కుందేరు, చలివేంద్రపాలెం గ్రామాల్లో సాగింది. ఏలియా మాట్లాడుతూ దళితులకు రిజర్వేషన్ ఫలాలు సమర్థంగా అందాలనే లక్ష్యంతోనే సమితి పోరాటాలు సాగిస్తుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కుంభా ప్రభుదాసు, ఉయ్యాల ఏడుకొండలు, కొడాలి నాగరాజు, కుంభా వెంకటేశ్వరరావు, సాలా పండు, కందుల శ్రీనివాసరావు, గరికె దుర్గాప్రసాద్, మద్దెల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మంగళవారం కార్తీక మాసోత్సవాల్లో భాగంగా సుమారు 300 మంది స్వాములకు అన్న ప్రసాద వితరణ జరిగింది. తొలుత మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీర మోహనరావు స్వాములతో కలిసి బాబాకు విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ 42 రోజుల పాటు దాతల సహకారంతో అత్యంత నిష్ఠతో అయ్యప్పస్వాములు, భవానీలకు ప్రతీ రోజు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామని తెలిపారు.